# ఎంచుకున్న దారి

"ఆనందరావు మామయ్య ఫోను చేశాడు... ఏం చెప్పమంటావ్?"

"నేను ఎప్పుడూ ఒకే మాట మీద నిలబడతాను, నాన్నా!" అన్నది నవ్వుతూ కూతురు–కరుణ!

ఆయన నుదుటి మీద పడుతున్న చెమటను పై పంచెతో తుడుచుకుంటూ జాలిగా కూతురు వంక చూచాడు.

అప్పుడు ఆమె వంటయింట్లో కూరకు తాలింపు వేస్తున్నది.

"ఏదైనా మంచి అవకాశం వచ్చినప్పుడు వదులుకోవటమంత తెలివి తక్కువ పని మరొకటి వుండదమ్మా... ఆనందరావు మామయ్యకు వాళ్ళు చాలా దగ్గర బంధువులు... కుర్రవాడు బుద్ధిమంతుడుట!"

"అయితే ఇంకేం... నాతోబాటు నిన్ను గూడా తీసుకు వస్తానని చెబితే అంగీకరించటానికి ఇబ్బందేమిటిట?"

ఆయన చికాగ్గా కూతురు వంక చూచాడు.

"అతడికి నా వయస్సున్నంత తండ్రి వున్నాడు... అంతకు రెండేళ్ళు తక్కువగా వున్న తల్లి ఉన్నది... వాళ్ళిద్దరికీ ఈ అబ్బాయి ఒక్కడే కొడుకు... వాళ్ళతోపాటు నన్ను కూడా ఎక్కడ నెత్తిన పెట్టుకుంటాడు... మనం చెప్పేదేదయినా సమంజసంగా ఉండాలి!"

"పెట్టుకోవద్దను... భార్యంటూ కావాలంటే కొన్ని బాధ్యతలు కూడా స్వీకరించగలిగే శక్తి వుండాలి... అందునా కరుణలాంటి అమ్మాయి అయితే మరీను!" అన్నది పకపకా నవ్వుతూ.

ఆ నవ్వును చూచి చలపతి చికాకు పడ్డాడు. జాలి పడ్డాడు. గుండె తడవగా బాధపడ్డాడు.

ఈ వ్యవహారం ఇలా ఓ కొలిక్కి రాకుండా నడుస్తున్నది గత అయిదు సంవత్సరాల బట్టి.

ఆయన భార్య మరణించి ఆరు సంవత్సరాలయింది.

ఆయనకు ఒక్కతే కూతురు. బి.ఎడ్. చదివి రెండు సంవత్సరాల క్రితం ఇంటికి దగ్గరలో వున్న ఓ స్కూల్లో టీచర్‌గా జేరింది. ఆమెకు అప్పుడే ఇరవై ఎనిమిదేళ్ళు వచ్చినయ్.

గత సంవత్సరమే ఆయన రిటయిరయ్యాడు. పెన్షన్ వస్తోంది.

కరుణ బి.ఎడ్. చేస్తున్నప్పుడే సంబంధాలు చూడటం మొదలు పెడితే– 'ముందు చదువు కానీయ్, తరువాత చూద్దాంలే'– అన్నది.

చదువయింతరువాత మొదలు పెడితే– 'నేను అత్తగారింటికి వెళితే, నీ సంగతేమిటి'– అన్నది.

"ఎవరి సంగతి వాళ్ళదే!" అన్నాడు ఆయన గుంభనగా. "నాకు వంట చేయటమంటే బహు ఇష్టం... ఆధరవులు రెండు పూటలకూ ఒకసారే ఉదయాన చేసి పడేస్తే... అన్నాన్ని ఏ పూటకు ఆ పూట వండుకొని వేడివేడిగా భోజనం చేయవచ్చు... కాదంటావా... ఏ రోజన్నా బద్ధకమేస్తే కూరలందించే దూకాణాలు వీధి వీధికీ వెలిసినయి... ఇంకా దిగులు దేనికి... అదీ చేసుకోలేనంటావా... ఏ హోటల్‌కు వెళ్ళినా అత్తగారింట్లో మర్యాదలు చేసినట్లుగా చేసి భోజనం పెట్టి మరీ పంపిస్తారు!" అన్నాడు చాలా తేలిగ్గా.

"అక్కడకు వెళ్ళేందుకూ ఓపిక లేకపోతే?" ఓ ప్రశ్న వేసి ఆయన దగ్గర సమాధానం ఉండదులే అన్నట్లుగా ముఖం పక్కకు తిప్పుకున్నది కరుణ.

"నువ్వు లేవా?" అన్నాడు చలపతి నవ్వేస్తూ.

"అదేనయ్యా తండ్రీ నేనూ చెప్పేది... నన్ను పెళ్ళి చేసుకుండేవాడు నిన్ను కూడా చూస్తానూ అంటే నాకే అభ్యంతరం లేదూ అంటున్నాను!"

"పూర్వంలో రాజులు ఇలాగే చేసేవాళ్ళట... కూతురుతో పాటు పండితుల్ని, సైనికుల్ని, దాసీలను, ఏనుగులను, గుర్రాలను కూడా పంపేవాళ్ళట అత్తవారింటికి... ఇప్పుడవన్నీ కుదరవు కాబట్టి నీతోపాటు నేనూ రావాలంటావ్... అంతేనా!" అన్నాడు ఆయన నిష్ఠూరంగా.

"నీ ఇష్టం ఎలా అనుకున్నా సరే... నిన్ను మాత్రం ఒంటరిగా వదిలి నేను పెళ్ళి చేసుకు వెళ్ళే ప్రసక్తే లేదు!"

"అంటే నేను పోతేనేగాని నువ్వు పెళ్ళి చేసుకోవన్నమాట!" విసురుగా అన్నాడు ఆయన కూతురి మొండితనానికి కోపం పట్టలేక.

"ఎవ్వరూ పోకుండా శాశ్వతంగానే ఈ భూమ్మీద వుంటారని నేను అనను గాని... ఉన్నంత కాలమయినా నా కన్నతండ్రి సుఖంగా వుండాలనేది నా కోరిక!" అన్నది తండ్రి మాటకు మనస్సు బాధతో గిలగిలలాడినా.

"ఒంటరిగానే వున్నా నేను సుఖంగానే వుంటాను లేవే... అంతగా ఇబ్బంది అనిపిస్తే ఏ వృద్ధాశ్రమంలోనో జేరిపోతాను... అక్కడ నాకు తోడుగా నాలాంటి వాళ్ళు చాలా మంది వుంటారు... ఎంత కావాలనుకున్నా ఖర్చుపెట్టగల స్థితి వున్నప్పుడు మనం ప్రతిదానికీ దిగులు పడగూడదు... వారం వారం నువ్వు వస్తుండవచ్చు నన్ను చూచేందుకు... వచ్చేటప్పుడు పండ్లు, ఫలహారాలు తీసుకు రావచ్చు... మర్చిపోయేవ్... నాకు సున్నుండలంటే బహు ఇష్టం... పుల్లారెడ్డి స్వీట్స్‌లో ఓ పావు కిలో తెచ్చావంటే మళ్ళా వారానికి నువ్వు వచ్చేటంత వరకూ రోజుకొకటి తింటూ వుంటాను!" అన్నాడు ఆయన పెద్దగా నవ్వుతూ.

ఆయన సంబంధాలు చూస్తూనే వున్నాడు.

కరుణ తన కండిషన్స్ వచ్చిన వాళ్ళకు చెబుతూనే వున్నది.

వచ్చిన వాళ్ళు వచ్చినట్లే వెళ్ళిపోతున్నారు– 'ఆ తోక మూకెందుకు' అంటూ!

తండ్రి చికాకు పడుతూనే వున్నాడు– ప్రతి సంబంధాన్నీ చెడగొడుతున్న కూతుర్ని చూస్తూ. కొన్నాళ్ళయితే మాట్లాడటం గూడా మానేశాడు.

ఒకరోజు విసుగెత్తి, "ఇక లాభం లేదే... వాళ్ళ చేత నీ మాటకు 'ఊఁ' అనిపించి మూడు ముళ్ళూ వేయిస్తాను... తరువాత సంగతి తరువాత చూద్దాం!" అన్నాడు.

"ఇంకా చూసేదేమున్నది... అలాగే... తరువాత సంగతి తరువాతే... నాతో నిన్ను వాళ్ళింటికి రానీయకపోతే నేను కాపురానికే వెళ్ళను... నువ్వు చేసిన ఆ పెళ్ళి మూడునాళ్ళ ముచ్చటే అవుతుంది... పెళ్ళయినా గుండెలమీద కుంపటిలా కూతురు కూర్చున్నందుకు నువ్వు మరీ బాధపడతావ్!" అన్నది కరుణా తేలిగ్గా నవ్వేస్తూ.

తల బాదుకున్నాడు చలపతి!

* * *

రెండు నెలలయింది చలపతి కూతురు దగ్గర పెళ్ళి విషయం ఎత్తి.

చూచేటందుకు గూడా ఎవ్వరినీ ఆహ్వానించలేదు.

కరుణా ఏ పేచీ లేకుండా ప్రశాంతంగా ఇంటి పనులు చూసుకుంటూ, ఉద్యోగం చేసుకుంటోంది. తండ్రిని ఆప్యాయంగా చూసుకుంటూ గడిపేస్తోంది.

ఓ సోమవారం...

సాయంత్రం ఆరు గంటలయింది...

ఇంకా సూర్యుడు వెళ్దామా వద్దా అన్నట్లుగా మేడల వెనుక దోబూచులాడుతున్నాడు.

చలపతి తన ఇంటి ముందు ఆటో దిగాడు.

స్కూలునుంచి అప్పుడే వచ్చిన కరుణ వాకిట్లో ఆగిన ఆటో శబ్దం వింటూనే బయటకు తొంగి చూచింది.

ఆటో దిగుతున్న తండ్రిని చూస్తూనే ఆశ్చర్యపోయింది- ఇప్పుడు ఆటో ఎక్కి ఎక్కడినుంచి వస్తున్నాడా అన్నట్లుగా.

ఆయన వెనుగ్గా ఆ ఆటోలోనుంచే ఓ స్త్రీ దిగింది.

ఆమెను అంతకు ముందు ఎక్కడో చూసినట్లే వున్నా 'ఇక్కడ' అని గుర్తు తెచ్చుకో కోలేకపోతోంది... వయస్సు యాభైకు పైనే వుంటుంది...

వాళ్ళను చూస్తూనే వరండా మెట్లు దిగి గేటు దగ్గరకు అడుగులు వేయబోయింది కరుణ.

కూతుర్ను చూస్తూనే, లోపలకు వడివడిగా వచ్చిన చలపతి, నవ్వుతూ, "శకుంతల పిన్నిని నువ్వు చూసేవుంటావ్... మా స్నేహితుడు రామబ్రహ్మంగారింట్లో ఉంటుంది... ఎవ్వరూ లేరు... వాళ్ళకే వంట సాయం చేస్తుంటుంది... నువ్వు నాకు తెచ్చిన సమస్యకు ఆమె ద్వారా ఓ దారంటూ కనబడింది... మా ఇంటికి వచ్చేయమన్నాను... తను రకరకాల రుచులతో వంట చేసి పెడుతుంటే నేను హాయిగా తింటుంటాను... ఆమె నాకు తోడుగా వుంటే నీకూ నా గురించి ఏ దిగులూ వుండదు... అటు ఎవరూ లేని శకుంతల పిన్నికీ ఓ నీడంటూ ఎప్పటికైనా కావాలి... ఇక లోకులు కాకులు కాకుండా ఉండేందుకు రిజిస్ట్రారాఫీసులో మా వివాహ తంతు కూడా ఈరోజే పూర్తి చేసుకున్నాం... రేపు ఆనందరావు మామయ్యను వచ్చి వాళ్ళ బంధువుల పిల్లవాడితో నీ వివాహం ఖాయం చేయమని కబురు చేశాను!" అన్నాడు చలపతి ఉల్లాసంగా నవ్వుతూ.

(నవ్య: సచిత్రవార పత్రిక: 13.05.2009)